ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 సంచిక : 3 నవంబర్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు|| 150/-
విడి ప్రతి : రు|| 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

05-09-2015
జిన్నూరు
06-09-2015
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## నాన్నగారి అరుగు

ఉదయపు సూర్యుని లేతకిరణాలు పచ్చని చెట్లమీదుగా జారుతూ కొబ్బరిచెట్ల గుబురుల మధ్య ఒదిగి ఉన్న ఆ ఇంటి పైకప్పుపెంకుల మీద నుంచి అరుగుమీద పరుచుకున్నాయి. ఇంటిలోపలి నుంచి తెల్లని వస్త్రాలు ధరించిన ఒక వృద్ధవ్యక్తి ఆ అరుగుమీదకి వచ్చి కొన్ని క్షణాలు మౌనంగా అచలంగా నిలబడి , తరువాత కాలకృత్యాలు తీర్చుకోవటానికి ఉద్యుక్తులయ్యారు. వారి ప్రతి కదలికలో ప్రశాంతత సరళత్వం ఉట్టిపడు తున్నాయి. పని కాగానే వారి కుర్చీలో నెమ్మదిగా కూర్చున్నారు. వారి హృదయంలో రహస్యంగా దాగి ఉన్న ఆనందం ముఖముపైకి తొణికిందా అన్నట్లు వారి వదనంపై చల్లని చిరునవ్వు.

కొందరు స్త్రీలు ఇంటి ప్రాంగణంలో అడుగుపెట్టి ముందుకు రావటానికి సంకోచిస్తూ నిలిచారు. వారిని చూడగానే ఆయన ముఖం ఆనందంతో విప్పారింది. చేతి సంజ్ఞతో వారిని ఆహ్వానించారు. సంతోషం వరదలా పొంగి వస్తుంటే, వెలిగిపోతున్న ముఖాలతో ఆ స్త్రీలు వారి పాదాలవద్ద చతికిలబడ్డారు. మరికొందరు స్త్రీలు పురుషులు వచ్చి ఆయనవైపు చూస్తూ అరుగుపై నిశ్శబ్దంగా కూర్చున్నారు. తన ప్రేమపూరితమైన చూపుతో వచ్చిన వారందరిని స్పృశిస్తూ, పురుషులను పిల్లలను అదనంగా తన స్పర్శతో భుజాలు వీపు నిమురుతూ, వారి ముఖాలను తన చేతులమధ్య తీసుకొని ఆప్యాయంగా చూస్తూ అందరిపై తన ప్రేమను దయను కురిపిస్తున్నారు. బడికి తయ్యారైన చిన్నపిల్లలు వచ్చి ఒకపక్కకి ఒదిగి నిలబడ్డారు. ఆయన వాళ్ళవైపు చూసి చిన్నగా తల ఊపారు. కనీకనిపించని ఆ చిన్న కదలికలో ఆ రోజుకి సరిపడా వారి ఒంతు అనుగ్రహం దీవెనలు అందుకొని ఆ పిల్లలు

నిశ్శబ్దంగా వెనుతిరిగి బడికి వెళ్ళిపోయారు.

వచ్చిన వారిలో కొందరు ఆయనకు పళ్ళు, మిఠాయిలు సమర్పించగా, వాటిని ఆప్యాయంగా అందుకొని, కొంతభాగం వాళ్ళకు తిరిగి ఇచ్చి, మిగతాది అక్కడ కూర్చున్న వారికి పంచుతారు. కొందరు ఏదైనా పుణ్యక్షేత్రం నుంచి ప్రసాదము కాని లేదా ప్రత్యేకంగా అలంకరించిన వస్తువు కాని తెస్తే, వాటికోసమే తపిస్తున్నట్లుగా ఆత్రంగా పసిపిల్లవాడిలా విప్పారిన ముఖంతో అందుకొని, దానిగురించి రకరకాల ప్రశ్నలు వేసి, దాన్ని అన్నివైపులా తిప్పి పరిశీలించి, ఒక పెద్ద దరహాసంతో అక్కడ ఉన్న ఎవరో ఒకరికి బహూకరించి, అక్కడితో దాన్ని మరచిపోయి (వదిలేసి) ఇంకొకరి వైపు తన దృష్టిని మళ్ళిస్తారు. ఇదంతా సద్గురు శ్రీ నాన్నగారి ఇంటి అరుగుమీద జరిగే దైనందిన కార్యక్రమము. ప్రతిరోజు ఉదయం మళ్ళీ మధ్యాహ్నం కొన్ని గంటలు, తనకోసం వచ్చే భక్తులకు కేటాయిస్తారు.

ఎన్నో సంవత్సరాలుగా ఈ అరుగు నాన్నగారి నోటినుండి జాలువారే అనుగ్రహభాషణలకు, వివేకంతో కూడిన సంభాషణలకు, వారి కళ్ళనుండి ముఖారవిందం నుండి చల్లని వెలుగులా ప్రసరించే ప్రేమ ఆప్యాయతలకు ఒక నిశ్శబ్దసాక్షిగా నిలిచింది. ఇంకా ఒక ఆలంబనకోసం, దారి చూపే పెన్నిధి కోసం, వెదుకుతూ వచ్చిన ఎందరివో సంతోషాలకు దుఃఖాలకు కూడా ఈ అరుగు ప్రత్యక్షసాక్షి. నాన్నగారి ప్రేమలో మునిగి తడచిపోవాలని, ఆర్ద్రతతో వారి మాటలను గ్రోలాలని భక్తులు ప్రతిరోజూ వస్తారు. తనివితీరక వస్తూనే ఉంటారు. వాళ్ళకి ఈ అరుగే స్వర్గం. దీనికి సమానమైనది కానీ దీనినిమించినది కానీ వాళ్ళకి ఈ ప్రపంచంలో లేదు. ఇక్కడ గడిపిన మధురక్షణాలు వాళ్ళకి అపురూపం.

ఈ అరుగుమీద తారతమ్యాలు ఉండవు. అధికారులు, నాయకులు, సంపన్నులు, పేదలు, పండితులు, నిరక్షరాస్యులు, గృహస్తులు, సన్యాసులు, ఎందరో ఇక్కడ శాంతిని పొందారు. అందరిపై ఒకే ఆదరణ. ఈ అరుగుమీద సత్యాన్వేషకులకు మార్గం దొరికింది. ఒక ఆలంబన అందింది. కష్టాలలో ఉన్నవారికి ఊరట లభించింది. ఇంకా కొత్తగా ఇటు దృష్టిమళ్ళినవారికి సుఖాన్ని చేరుకునే దారి గోచరించింది.

అరుగు ఇప్పుడు కనిపించకపోయినా దానికి ఆ వైభవాన్ని కలిగించిన ఆ పరమాత్మ అచ్యుతం అక్కడినుంచి వర్షించే అనుగ్రహం అనంతం. నాన్నగారి భక్తుల హృదయాలలో అరుగుకి ఉన్న స్థానం శాశ్వతం.

**- హైదరాబాద్ బేబి.**

